


# కరపత్రం

SINCE 2014

సోమవారం జూలై 27, 2026 | సంపుటి : 2 | సంచిక : 285 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

## ప్రధాని మోదీ కీలక అప్‌డేట్..

# సంస్కరణల కోసం హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్

- పరీక్షల సంస్కరణలకు టాస్క్‌ఫోర్స్
- నందన్ నీలేకని నేతృత్వంలో కమిటీ
- నీట్ లీక్‌పై కేంద్రం కీలక నిర్ణయం
- పేపర్ లీక్‌లకు కఠిన చట్టం
- పారదర్శక పరీక్షలే లక్ష్యం
- ఎన్‌టీఏ వ్యవస్థలో సంస్కరణలు
- టెక్నాలజీతో పరీక్షల భద్రత
- మోదీ కీలక ప్రకటన



**దిల్లీ:**
నీట్ ప్రశ్నపత్రం లీకేజీ దుమారం రేపిన వేళ కేంద్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు వేగవంతం చేసింది. ఈ క్రమంలోనే పరీక్షా విధానంలో సంస్కరణలపై సిఫార్సులకు ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వంలో హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో విడుదల చేశారు.
"ఈ టాస్క్‌ఫోర్స్ పరీక్షల సంస్కరణలపై దృష్టి పెడుతుంది. కమిటీ నివేదిక అధారంగా విశ్వసనీయత దెబ్బతినకుండా భవిష్యత్‌లో పరీక్షల నిర్వహణపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. ప్రశ్నపత్రం లీకేజీని అరికట్టేందుకు కఠినమైన చట్టం తీసుకొస్తున్నాం. దీనికి సంబంధించిన బిల్లును సోమవారం పార్లమెంట్‌లో ప్రవేశపెడతాం. విశ్వసనీయమైన, పారదర్శకమైన పరీక్ష విధానం అమలు చేస్తాం. పరీక్షల నిర్వహణలో అత్యున్నత టెక్నాలజీని అవలంబిస్తాం" అని మోదీ తన వీడియోలో పేర్కొన్నారు.

### టాస్క్ ఫోర్స్ సభ్యులు వీళ్లే..

నందన్ నీలేకనితో పాటు మరో ఐదుగురు ఈ టాస్క్ ఫోర్సులో సభ్యులుగా ఉంటారు. యస్. సోమనాథ్ (ఇస్రో మాజీ ఛైర్మన్), తపన్ దేకా (ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ డైరెక్టర్), వి. కామకోటి (ఐఐటీ మద్రాస్ డైరెక్టర్), అనితా కర్వాల్ (కేంద్ర విద్యాశాఖ మాజీ కార్యదర్శి), అమృత్ లాల్ మీనా (లాజిస్టిక్స్, పరిపాలనా నిపుణుడు).

### ప్రధాన బాధ్యతలు

ఎన్‌టీఏ పరీక్ష వ్యవస్థను పునర్వ్యవస్థీకరించడం
పరీక్షల్లో సాంకేతిక భద్రతను బలోపేతం చేయడం
పేపర్ లీకులు, మాల్‌ప్రాక్టీస్‌ను అరికట్టేందుకు కొత్త వ్యవస్థలు రూపొందించడం
పరీక్షల నిర్వహణలో నిర్మాణాత్మక సంస్కరణలు సూచించడం
డిజిటల్ భద్రత, అభ్యర్థుల ధ్రువీకరణ, డేటా రక్షణకు అత్యాధునిక సాంకేతిక పరిష్కారాలు సిఫార్సు చేయడం
భవిష్యత్తులో జాతీయ స్థాయి పరీక్షలు పారదర్శకంగా, విశ్వసనీయంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించడం



# ఎమ్మెల్యే, ఎంపీ వయోపరిమితి తగ్గించాలి

## ఎంపీ, ఎమ్మెల్యే కావడానికి 25 ఏళ్లు ఎందుకు? చట్టసభల పోటీకి ఏజ్ తగ్గించాలి: సీఎం రేవంత్

- 25 నుంచి 21 ఏళ్లకు తగ్గించాలన్న రేవంత్
- రాజకీయాల్లో యువతకు పెద్దపీట
- ఆగస్టులో అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానం
- కేంద్రానికి ప్రతిపాదన పంపనున్న ప్రభుత్వం
- పేపర్ లీక్‌లపై కఠిన చట్టం కోరిన సీఎం
- యువత ఐక్యంగా పోరాడాలని పిలుపు
- 21 ఏళ్లకే పోటీ అవకాశం ఇవ్వాలి

దేశ రాజకీయాలో యువత పాత్ర మరింత క్రియాశీలకంగా మారాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. చట్టసభలకు పోటీ చేసే అభ్యర్థుల కనిష్ట వయోపరిమితిని ప్రస్తుతమున్న 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని ఆయన అన్నారు.
21 ఏళ్ల వయస్సులోనే యువత సివిల్ సర్వెంట్ అధికారులుగా దేశాన్ని పాలిస్తున్నప్పుడు.. ఎంపీలు, ఎమ్మెల్యేలుగా పోటీ చేయడానికి మాత్రం 25 ఏండ్లు ఎందుకు ఉండాలని ఆయన ప్రశ్నించారు. పరిపాలనలో యువతకు పెద్దపీట వేయాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేశారు.
ఈ ప్రతిపాదనపై భవిష్యత్ కార్యాచరణను కూడా ఆయన ప్రకటించారు . రాబోయే ఆగస్టు నెలలో శాసనసభలో దీనిపై ప్రత్యేక తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఈ ప్రతిపాదనను వివరిస్తానని, కూటమి పార్టీలన్నింటినీ త్వరలో కలుస్తానని వెల్లడించారు.
ఇదే వేదికగా దేశంలో నిరుద్యోగులను వేధిస్తున్న పేపర్ లీకేజీల అంశంపై కూడా సీఎం రేవంత్ తీవ్రంగా స్పందించారు. పేపర్ లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్ తీవ్రంగా దెబ్బతింటోందని, వీటిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కఠినమైన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రశ్నించిన ప్రతిపక్షాలపై ఈడీల ద్వారా వేధించారని, అయితే యువత ఐక్యంగా పోరాడితే కేంద్రం సైతం తలవంచక తప్పదని ఆయన హెచ్చరించారు.



## పెద్ది సుదర్శన్‌రెడ్డికి తీవ్ర అస్వస్థత.. హెల్త్ బులిటెన్ విడుదల

**వరంగల్:**
నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. హనుమకొండలోని నివాసంలో ఉండగా ఇవాళ ఉదయం ఆయనకు గుండె పోటు రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన రోహిణి ఆసుపత్రికి తరలించారు.

2 లో



## డిజిటల్ వేదికలకు హైకోర్టు షాక్..

### 200 వీడియోల తొలగింపు!

- బాధితురాలి గోప్యతకు రక్షణ
- డిజిటల్ కంటెంట్ తొలగించండి
- యూట్యూబ్, మెటా, ఎక్స్‌కు ఆదేశాలు
- గుర్తింపు వెల్లడించొద్దు
- గోప్యత హక్కులకు ప్రాధాన్యం
- సోషల్ మీడియాకు షాక్
- అభ్యంతరకర పోస్టుల తొలగింపు
- గోప్యత భంగంపై కోర్టు సీరియస్
- వెంటనే కంటెంట్ తొలగించాలి

## విద్యార్థుల విజయాన్ని రేవంత్ తన ఖాతాలో వేసుకోవడం సిగ్గుచేటు: కవిత



- రేవంత్‌పై కవిత విమర్శలు
- విద్యార్థుల విజయానికి క్రెడిట్ ఎందుకు?
- యువతను కాంగ్రెస్ మోసం చేసింది
- హామీలు అమలు చేయాలని డిమాండ్
- ఊరేగింపులతో నిజాలు మారవు
- మాట తప్పితే గద్దె దింపుతారు
- జయువతే విజయానికి కారణం
- రాజకీయ ప్రచారం సిగ్గుచేటు

**హైదరాబాద్:**
విద్యార్థులు సాధించిన విజయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి తన ఖాతాలో వేసుకోవడం సిగ్గుచేటని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత విమర్శించారు. యువతకు ఇచ్చిన హామీలపై ఎక్కడ నిలదీస్తారోనని ఊరేగింపులు చేస్తారా? అని ప్రశ్నించారు. తెలంగాణ యువతకు ఎన్నో హామీలు ఇచ్చి మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్‌దని విమర్శించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే వాళ్లు ఆ పార్టీని గద్దె దించడం ఖాయమన్నారు.

## సామాన్యులను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోకండి.. నిర్మలా సీతారామన్

- అధికారులకు సీతారామన్ హితబోధ
- సేవల్లో జాప్యం వద్దు
- ప్రజల కోసం చొరవ చూపాలి
- నిజాయతీగా పనిచేయాలి
- నిర్లక్ష్యంపై మంత్రి అసంతృప్తి
- సేవలు సకాలంలో అందించాలి
- ప్రజలకు ఇబ్బందులు తగ్గించాలి



**ఇంటర్నెట్ డెస్క్:**
ఆదాయపు పన్ను శాఖ అధికారులు సామాన్యుల ప్రయోజనాల కోసం పనిచేయాలని, ప్రతి చిన్న పనికి వారిని కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ హితబోధ చేశారు. అధికారులు తమ విధుల్లో పూర్తి సామర్థ్యంతో, నిజాయతీగా పనిచేయాలని సూచించారు. అదే సమయంలో ప్రభుత్వ శాఖల నిర్లక్ష్య వైఖరి పట్ల ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ముంబయిలో కొత్త 'ఆయ్‌కార్ సింధు' భవనాన్ని నిర్మలా సీతారామన్ ఆదివారం ప్రారంభించి మాట్లాడారు.

మిగతాద్ది 2 లో



2 లో

## ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ భూసేకరణ..రూ. 2278 కోట్లు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

ఆదిలాబాద్ ప్రజల దశాబ్దాల కల సాకారమయ్యే దిశగా అడుగులు పడ్డాయి. ఆదిలాబాద్ విమానాశ్రయ భూసేకరణ కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక నిర్ణయం తీసుకుంది. ఏకంగా రూ.2,278.14 కోట్ల భారీ నిధులను మంజూరు చేస్తూ జీవోను విడుదల చేసింది.



## యాదాద్రి జిల్లాలో భారీగా సీఎంఆర్ రైస్ మాయం

**భువనగిరి:**
యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఓ రైస్ మిల్లులో భారీగా సీఎంఆర్ రైస్ మాయమైంది. భువనగిరి మండలం అనంతారంలో యాదాద్రి రైస్ ఇండస్ట్రీలో ఈ ఘటన చోటుచేసుకుంది. 2022-23, 2024-25 రబీ సీజన్లకు చెందిన 6.700 మెట్రిక్ టన్నుల రైస్ కనిపించకుండా పోవడంతో పౌరసరఫరాల శాఖ అధికారులు భువనగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీటి విలువ రూ.24.30 కోట్లుగా అంచనా వేస్తున్నారు. మిల్లుకు చెందిన ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఈ లోగో క్రియేట్‌కి బహుమతి రూ.20 వేలు!

- సీఎంసీ లోగోకు పోటీల ఆహ్వానం
- ప్రథమ బహుమతిగా రూ.20 వేలు




**హైదరాబాద్:**
సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) అధికారిక లోగో రూపకల్పనకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐయూఎం) సహకారంతో ప్రత్యేక డిజైన్ పోటీ ప్రకటించింది. విద్యార్థులు, ఆర్కిటెక్ట్‌లు, గ్రాఫిక్ డిజైనర్లు, విజువల్ ఆర్టిస్టులు, సృజనాత్మక రంగ నిపుణులు పాల్గొనవచ్చని తెలిపింది

## ఇందిరమ్మ ఇళ్ల పేరుతో మోసాలు..

# అప్రమత్తంగా ఉండాలన్న సజ్జనార్



మిగతాది 2లో

- ఇందిరమ్మ ఇళ్ల పేరుతో సైబర్ మోసాలు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: సజ్జనార్
- నకిలీ కాల్స్, లింకులు నమ్మొద్దు
- రూ.10,000 ఈఎండీ పేరిట మోసాలు
- ఓటీపీ, యూపీఐ పిన్ పంచుకోవద్దు
- దళారులను నమ్మొద్దని హెచ్చరిక
- సైబర్ మోసమైతే 1930కు కాల్ చేయండి
- ఇళ్ల కేటాయింపు పూర్తిగా పారదర్శకం



## శ్రీరాంసాగర్ జలాశయంలో యువకుల గల్లంతు

**నిజామాబాద్:**
శ్రీరాంసాగర్ జలాశయంలో నలుగురు యువకులు గల్లంతయ్యారు. ప్రాజెక్టులో స్నానానికి దిగి నలుగురు గల్లంతయ్యారు. ముగ్గురు నిజామాబాద్ చెందిన వారిగా గుర్తించారు. మరో యువకుడ్ని హిమాయత్‌నగర్ వాసిగా గుర్తించారు. వీరిలో ఒకరి మృతదేహం లభ్యం కాగా, మరో ముగ్గురు కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# డిజిటల్ వేదికలకు హైకోర్టు షాక్.. 200 వీడియోల తొలగింపు!

మొదటి పేజీ తరువాయి

లైంగిక దాడి బాధితురాలి గోప్యత, ఆత్మగౌరవాన్ని కాపాడుతూ తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. బాధితురాలి గుర్తింపును బహిర్గతం చేస్తూ, ఆమె ప్రాథమిక గోప్యతా హక్కును భంగపరిచే విధంగా సామాజిక మాధ్యమాల్లో ఉన్న 200కు పైగా డిజిటల్ కంటెంట్‌ను వెంటనే తొలగించాలని ఆదేశించింది. ఈ కేసులో విచారణ జరిపిన జస్టిస్ బి విజయ్‌సేన్ రెడ్డి, యూట్యూబ్, గూగుల్, మెటా (ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్), ఎక్స్ (గతంలో ట్విట్టర్) సంస్థలకు మధ్యంతర ఆదేశాలు జారీ చేశారు. పిటిషనర్‌కు సంబంధించిన గుర్తింపును వెల్లడించే, గోప్యతకు భంగం కలిగించే అన్ని అభ్యంతరకర డిజిటల్ కంటెంట్‌ను వెంటనే తొలగించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.
చట్టపరమైన విజ్ఞప్తులు చేసినప్పటికీ సోషల్ మీడియా దిగ్గజాలు స్పందించకపోవడంతో హైకోర్టులో ఈ పిటిషన్‌ను దాఖలు చేసినట్లు న్యాయవాది నాగుర్‌బాబు ఎన్ తెలిపారు. బాధితురాలి ఫొటోలు, వీడియోలు నిరంతరం ప్రసారం కావడం వల్ల ఆమె గౌరవానికి తీవ్ర భంగం కలుగుతోందని వాదించారు. సమాచార ప్రసార మంత్రిత్వ శాఖతో పాటు మధ్యవర్తి సంస్థల గ్రీవెన్స్ అధికారులకు విన్నవించినా చర్యలు లేకపోవడంతో, రాజ్యాంగంలోని 14, 21 వ ఆర్టికల్స్, ఐటీ చట్టం-2000, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం బాధితురాలి హక్కులను రక్షించాలని కోరుతూ కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు.
వాదనలు విన్న హైకోర్టు.. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖతో పాటు టెలికాం దిగ్గజాలకు నోటీసులు జారీ చేసింది. పిటిషన్‌లో పేర్కొన్న అనుబంధం-ఎ లోని 200కు పైగా యూట్యూబ్ వీడియోలు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ పోస్టులను తక్షణమే తొలగించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసు తదుపరి విచారణను ఆగస్టు 20కి కోర్టు వాయిదా వేసింది.

### ఇందిరమ్మ ఇళ్ల పేరుతో మోసాలు..

# అప్రమత్తంగా ఉండాలన్న సజ్జనార్

మొదటి పేజీ తరువాయి

ఇందిరమ్మ ఇళ్ల పేరుతో సైబర్ మోసాలు జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ సీపీ సజ్జనార్ హెచ్చరించారు. రూ.10,000 ఈఎండీ చెల్లింపుల పేరుతో నకిలీ కాల్స్, లింకుల ద్వారా మోసాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. డబ్బులు చెల్లిస్తే ఇల్లు ఇప్పిస్తామంటూ మోసగాళ్లు చెప్పే మాటలు నమ్మొద్దని సూచించారు. "ఈ రోజే చివరి తేదీ అంటూ భయపెట్టి డబ్బులు కాజేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. వాట్సప్, ఎస్ఎంఎస్‌లలో వచ్చే అపరిచిత లింకులు, ఏపీకే ఫైళ్లు డౌన్‌లోడ్ చేయొద్దు. AnyDesk, TeamViewer వంటి స్క్రీన్ షేరింగ్ యాప్‌లు ఇన్‌స్టాల్ చేయవద్దు. యూపీఐ పిన్.. రీఫండ్ కోసం అవసరం లేదు, ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ చెప్పొద్దు. ఆధార్, బ్యాంక్ వివరాలు, ఓటీపీలు అపరిచితులతో పంచుకోవద్దు. ఇళ్ల కేటాయింపు ప్రక్రియ పూర్తిగా పారదర్శకం.. దళారులకు ఎలాంటి అవకాశం లేదు. ఇల్లు కేటాయించకపోతే ఈఎండీ మొత్తాన్ని ప్రభుత్వమే దరఖాస్తుదారుడి బ్యాంకు ఖాతాలోకి తిరిగి జమ చేస్తుంది. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు కాల్ చేయాలి. లేదా cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలి" అని సీపీ సూచించారు.

## సామాన్యులను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోకండి.. నిర్మలా సీతారామన్

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా ఐటీ అధికారులను ఉద్దేశించి ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదాయపు పన్ను శాఖ ప్రభుత్వ ఏజెన్సీనే అయినప్పటికీ ఈ ప్రాజెక్ట్ అనుమతుల కోసం ఆ శాఖ పడిన ఇబ్బందికర పరిస్థితుల గురించి ఆమె గుర్తుచేశారు. ఒక ప్రభుత్వ సంస్థే ఇలా ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటే సామాన్యుల పరిస్థితి ఏంటని ఆమె ప్రశ్నించారు.
సామాన్యులను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవద్దని, వారి తరఫున అధికారులే చొరవ తీసుకొవాలని సూచించారు. అలాగని నిబంధనలను ఉల్లంఘించాలని చెప్పడం లేదన్నారు. వారు పొందాలనుకున్న సర్వీసులను జాప్యం లేకుండా అందించాలన్నారు. ఈ దేశంలో సామాన్యులు తమ న్యాయపరమైన హక్కులను పొందడానికి కష్టపడాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

# పెద్ది సుదర్శన్‌రెడ్డికి తీవ్ర అస్వస్థత.. హెల్త్ బులిటెన్ విడుదల

మొదటి పేజీ తరువాయి

చికిత్స అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులు వెల్లడించారు.
"కార్డియాక్ అరెస్ట్‌కు గురైన సుదర్శన్‌రెడ్డిని రోహిణి ఆసుపత్రికి తీసుకొచ్చారు. దాదాపు గంట సేపు సీపీఆర్ చేశాక పేషెంట్ రెస్పాండ్ అయ్యారు. గుండెకు రక్తాన్ని తీసుకెళ్లే రక్తనాళం ఫల్మనో ఆర్ట్రీలో రక్తం గడ్డ కట్టడంతో బ్లాక్‌లు ఏర్పడ్డాయి. అవి కరగటానికి ఇంజెక్షన్ ఇచ్చాం. యాంజియోగ్రామ్ చేశాం. పల్స్ కూడా నార్మల్‌గానే ఉది. కుటుంబ సభ్యుల నిర్ణయం మేరకు వెంటిలేటర్ సాయంతో హైదరాబాద్‌కు తరలిస్తున్నాం" అని చికిత్స అందించిన కార్డియాలజిస్ట్ డాక్టర్ మమత రెడ్డి వెల్లడించారు.
పెద్ది సుదర్శన్‌రెడ్డి అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులు ఆసుపత్రికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుదర్శన్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ భూసేకరణ..రూ. 2278 కోట్లు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

మొదటి పేజీ తరువాయి

ఈ మహా స్వప్నం సాకారం కావడానికి విశేష కృషి చేసిన సీఎం రేవంత్ రెడ్డికి, ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకి, స్థానిక నాయకులు కంది శ్రీనివాస రెడ్డి కి , కాంగ్రెస్ పార్టీ పెద్దలందరికీ ఆదిలాబాద్ నియోజకవర్గ ప్రజలు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.
ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ నిర్మాణంపై కూడా రాష్ట్ర ప్రభుత్వం పట్టుబడుతున్నదని ఇటీవల రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇక్కడ డిఫెన్స్ భూమి సుమారు 250 ఎకరాలు ఉండడం కలిసొచ్చే విషయమని పేర్కొన్నారు. అందువల్ల రక్షణ శాఖతో కలిసి ఈ ఎయిర్ పోర్టు నిర్మించాలని చెప్పారు. ఫైనల్ గా రాజ్నాథ్ సింగ్ చొరవతో డిఫెన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ను ముందుకు నడిపించాలని, రక్షణ శాఖ అధికారులు కూడా పాజిటి వ్ ప్రతిపాదనలు ఇచ్చారన్నారు. ఈ ఎయిర్ పోర్టు 1,700 ఎకరాల భూమి కావాలంటే.. ఈ భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసిందని చెప్పారు. వీలైనంత త్వరగా భూసేకరణ చేసుకుంటే.. కచ్చితంగా అద్భుతమైన ఎయిర్ పోర్ట్ ఆదిలాబాద్ నిర్మితమవుతుందన్నారు. కేవలం సివిలియన్నే కాకుండా.. డిఫెన్స్ యాక్టివిటీస్కు సంబంధించిన ఎయిర్ పోర్ట్ అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఆదిలాబాద్కు సరిహద్దుగా ఉన్న రాష్ట్రాలకు ఈ ఎయిర్ పోర్ట్.. డిఫెన్స్ స్ట్రాటజిక్ లొకేషన్ అని పేర్కొన్నారు. ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు కూడా పౌర విమానయాన సంస్థ నుంచి అన్ని విధాలుగా సహకరిస్తామని సీఎం రేవంత్కు హామీ ఇచ్చినట్టు వెల్లడించారు.

# 'ఉత్తర తెలంగాణ అభివృద్ధికి మరో కీలక అడుగు'



**హైదరాబాద్:**
ఉత్తర తెలంగాణ అభివృద్ధికి మరో కీలక అడుగు పడిందని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదిలాబాద్‌లో ప్రతిష్ఠాత్మక జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ ఏర్పాటుకు రూ.2,278.14 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.
ఈ ప్రాజెక్టు కోసం మొత్తం 2,009.23 ఎకరాల భూమిని సేకరించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇందులో 1,609.23 ఎకరాలు భారత వైమానిక దళం (IAF) అవసరాల కోసం, 400 ఎకరాలు సివిల్ ఏవియేషన్ ఎన్‌క్లేవ్, ఎంఆర్ఓ (MRO), కార్గో టెర్మినల్, హ్యాంగర్లు, భవిష్యత్ విస్తరణ అవసరాల కోసం కేటాయించనున్నట్లు తెలిపారు.
భూసేకరణతో పాటు ఇప్పటికే ఉన్న రహదారుల మళ్లింపు, 765 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ల తరలింపు, వాగుల మళ్లింపు, మిషన్ భగీరథ తాగునీటి పైప్‌లైన్ల మార్పు, విద్యుత్ స్తంభాల తొలగింపు వంటి అన్ని అనుబంధ పనులకు అవసరమైన నిధులను కూడా ఈ పరిపాలనా అనుమతిలో భాగంగా కేటాయించినట్లు మంత్రి వివరించారు.
ఆదిలాబాద్ జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ రాష్ట్రానికి వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన ప్రాజెక్టు అని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. భారత వైమానిక దళం, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా అభివృద్ధి చేయనున్న ఈ ఎయిర్‌ఫీల్డ్ వల్ల ఉత్తర తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులు, కార్గో రవాణా, పర్యాటకం, రక్షణ రంగాలకు విశేష ఊతం లభించడంతో పాటు వేలాది మంది యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని అన్నారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాతో నిరంతర సమన్వయం ఫలితంగానే ఈ ప్రాజెక్టు వేగంగా ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ వ్యయంతో పాటు అన్ని అడ్డంకుల తొలగింపు ఖర్చును కూడా భరిస్తోందని చెప్పారు.
ప్రభుత్వ ఆదేశాల మేరకు భూసేకరణతో పాటు రహదారులు, విద్యుత్ లైన్లు, ఇతర మౌలిక వసతుల మార్పిడి పనులను 2026 డిసెంబర్ 31 నాటికి పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు.ప్రాంతీయ సమతుల అభివృద్ధే సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని, ఆదిలాబాద్ జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ ఉత్తర తెలంగాణ అభివృద్ధికి గేమ్‌చేంజర్‌గా నిలుస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.

# మహారాష్ట్రలో మావోయిస్టుల కదలికలు... జులై 30 వరకు గడ్చిరోలీ జిల్లా వ్యాప్తంగా బంద్ కు పిలుపు..



మహారాష్ట్రలో మళ్ళీ మావోయిస్టుల కదలికలు కలకలం రేపాయి. మహారాష్ట్రలోని గడ్చిరోలిలోని భామ్రాగడ్ అటవీ ప్రాంతంలో మావోయిస్టుల పోస్టర్లు ప్రత్యక్షమవ్వడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఆదివాసీల జల్ జంగల్ జమీన్ హక్కుల పరిరక్షణ కోసం, స్థానిక సమస్యలపై నిరసనగా ఉత్తర గడ్చిరోలి డివిజన్ కమిటీ పోస్టర్లు విడుదల చేసింది.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ జులై 30 వరకు గడ్చిరోలి వ్యాప్తంగా బంద్ కు పిలుపునిచ్చారు మావోయిస్టులు.
అత్యవసర సేవలు మినహా మిగిలిన అన్ని రవాణా, వ్యాపార సముదాయాలు మూసివేయాలని పోస్టర్లలో పేర్కొన్నారు మావోయిస్టులు. దీంతో అలర్ట్ అయ్యారు గడ్చిరోలి పోలీసులు, సీ 60 కమాండో దళాలు రంగంలోకి దిగాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా దాడులుఎం జరగకుండా ఉండేందుకు సరిహద్దు ప్రాంతాల్లో భద్రతా బలగాలను మోహరించారు. భామ్రాగడ్, అహేరి, ఏటపల్లి అటవీ ప్రాంతాల్లో విస్తృతంగా కూంబింగ్ చేపట్టాయి భద్రతా బలగాలు.
మావోయిస్టుల బంద్ కు సంబంధించి ప్రజలు ఎలాంటి పుకార్లను నమ్మొద్దని.. భయాందోళనలు అవసరం లేదని, ఏజెన్సీ ప్రాంతాలు పూర్తిగా పోలీసుల కంట్రోల్ లో ఉందని తెలిపారు అధికారులు.

# కరీంనగర్ బేకరీలో అగ్ని ప్రమాదం.. కాలి బూడిద.. ఏం మిగల్లేదు !



కరీంనగర్: కరీంనగర్ బేకరీలో అగ్ని ప్రమాదం జరిగింది. కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని బేకరీలో అర్ధరాత్రి అగ్ని ప్రమాదం జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఒక్కసారిగా చెలరేగిన మంటలతో బేకరీలో భారీ నష్టం జరిగింది.
ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. బేకరీలోని సామాగ్రి, ఎలక్ట్రికల్ పరికరాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రమాదంలో ప్రాణ నష్టం లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.
అగ్నిప్రమాదానికి కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.
నార్కట్‌పల్లి మండలం చెరువుగట్టు గ్రామంలో కూడా భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ధర్మకర్త శ్రావణయ్య షాపులో మొదట మంటలు చెలరేగినట్లు సమాచారం. అక్కడి నుంచి పక్కనే ఉన్న దుకాణాలకు మంటలు వేగంగా వ్యాపించాయి. 15 పెద్ద దుకాణాలు, 15 చిన్న దుకాణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు ?75 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు పోలీసులు అంచనా వేశారు. గ్రామ పంచాయతీ భవనం కూడా మంటల్లో దగ్ధమైంది. మూడు ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టారు.

# గుజరాత్‌లో వరదల బీభత్సం వల్సాద్‌లో నీట మునిగిన గృహసముదాయాలు

గుజరాత్‌లోని వల్సాద్‌లో భారీ వర్షాలకు నివాస సముదాయాలు నీట మునిగాయి. ఓ వ్యక్తి తన ఇంటి బయట వరద నీటిలో నిలబడి ఉన్న వీడియో వైరల్ అయింది. ఇక్కడ పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో ఆ వీడియో చూస్తే తెలుస్తోంది. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాల కారణంగా వీధులు, రోడ్లు పూర్తిగా నీట మునిగిపోవడంతో, సదరు యువకుడు తన ఇంటి బయట మెడలోతు వరద నీటిలో నిలబడి పరిస్థితిని వివరించాడు. పార్క్ చేసిన వాహనాలు, ప్రహరీలు, భవనాల పైభాగాలు మాత్రమే బయటకు కనిపిస్తున్న ఈ దృశ్యాలు వరద తీవ్రతను స్పష్టంగా చూపిస్తున్నాయి. ఈ వీడియోలో సదరు వ్యక్తి మునిగిపోయే స్థాయిలో నీరు చేరడం చూసి నెటిజన్లు షాక్ అవుతున్నారు. వీధులు, ఖాళీ స్థలాల మధ్య తేడా తెలియకుండా అంతా జలమయం కావడంతో అక్కడి నివాసితుల దైనందిన జీవితం పూర్తిగా స్తంభించిపోయింది. పట్టణాల్లో అరకొరగా ఉన్న మురుగునీటి పారుదల వ్యవస్థలు, ఈ తరహా ముంపునకు ప్రధాన కారణమని ఆన్‌లైన్‌లో పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ దృశ్యాలు చూసిన పలువురు నెటిజన్లు శివమ్ సింగ్, ఇతర నివాసితులు సురక్షితంగా ఇళ్లలోనే ఉండాలని కోరారు. మరోవైపు అధికారులు, రెస్క్యూ టీమ్ ఇప్పటికే పలువురిని సురక్షిత ప్రదేశాలకు తరలించినట్లు సమాచారం.

# జిల్లాలో విష జ్వరాలకు ఇద్దరు చిన్నారుల మృతి

జిల్లాలోని పొరండ్ల గ్రామంలో విషజ్వరాలు ఆందోళన కలిగిస్తున్నాయి. గ్రామంలో విషజ్వరాల బారిన పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందడం స్థానికంగా విషాదాన్ని నింపింది. విషజ్వరంతో బాధపడుతున్న హరిస్మిత(6) అనే చిన్నారి.. చికిత్స పొందుతూ మృతి చెందింది. శుక్రవారం వరుణ్ తేజ(6) అనే చిన్నారి కూడా విషజ్వరం బారిన పడి ప్రాణాలు కోల్పోయాడు. వైరల్ ఫీవర్ కారణంగానే చిన్నారులు మరణించినట్లు వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఇద్దరు చిన్నారుల మృతిలో వైద్యారోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. పొరండ్ల గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. జ్వరం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు ఉంటే వెంటనే ఆస్పత్రికి వెళ్లాలని వైద్య సిబ్బంది సూచిస్తున్నారు. జిల్లాలో పరిస్థితిపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

# ఈ లోగో క్రియేట్‌కి బహుమతి రూ.20 వేలు!

మొదటి పేజీ తరువాయి

ప్రథమ బహుమతిగా రూ.20 వేలు, ద్వితీయ రూ.15వేలు, తృతీయ రూ.10 వేలు అందజేయనున్నారు.
ఎంట్రీల సమర్పణకు ఆగస్టు 5 చివరి తేదీ. ఆగస్టు 10న విజేతలను ప్రకటిస్తారు. ఎంపికైన లోగోను స్వాతంత్ర్య దినోత్సవాన ఆవిష్కరించనున్నారు. ఆసక్తి ఉన్నవారు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఆన్లైన్‌లో ఎంట్రీలు సమర్పించాలి. సైబరాబాద్‌కు శాశ్వత గుర్తుగా నిలిచే లోగో రూపకల్పనలో భాగం కావడానికి ఇదో అరుదైన అవకాశమని కమిషనర్ సృజన పేర్కొన్నారు. సుపరిపాలన, సుస్థిర, అభివృద్ధి చెందుతున్న నగర దృక్పథాన్ని ఆవిష్కరించాలని సూచించారు.
లోగో పూర్తిగా ఒరిజినల్ సృష్టి అయి ఉండాలని స్పష్టం చేశారు. ఏఐ, ఈపీఎస్ లేదా ఎస్‌వీజీ వెక్టర్ ఫార్మాట్‌లో రూపొందించిన డిజైన్లకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. కాగా, అధిక నాణ్యత గల పీఎన్‌జీ లేదా జేపీఈజీ ఫైల్‌తో పాటు, గరిష్ఠంగా 250 పదాల్లో డిజైన్ వెనుక ఉన్న భావనను సమర్పించాల్సి ఉంటుంది. అభ్యర్థికి ఒక ఎంట్రీ మాత్రమే. కాపీరైట్ ఉల్లంఘన లేదా కృత్రిమ మేధ (ఏఐ) ద్వారా నకలు చేసిన డిజైన్లను పరిగణనలోకి తీసుకోరు. డిజిటల్, ప్రింట్ వినియోగానికి అనువుగా ఉండేవాటినే పరిశీలిస్తారు.

# ధర్మేంద్ర ప్రధాన్ శాఖ మారొచ్చు కేంద్రం పరిశీలిస్తోందన్న రాహుల్

విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను మరో శాఖకు మార్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందన్న వార్తలు ఉన్నాయని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. కేంద్రం ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించబోదన్న వార్తల నడుమ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా సహా మూడు డిమాండ్స్‌ను విద్యార్థులు ప్రభుత్వం ముందు పెట్టారని అన్నారు. వీటి విషయంలో వారు రాజీపడబోరని అభిప్రాయపడ్డారు. 'అసమర్థ, అవినీతి మరక అంటిన ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్నది మొదటి డిమాండ్. అయితే, ఆయన శాఖ మార్చే అంశం ప్రధాని కేబినెట్‌లో చర్చకు వచ్చినట్టు టాక్ వినిపిస్తోంది. భారతీయ విద్యార్థులు దీన్ని అస్సలు ఆమోదించరు. దీన్ని ఎవ్వరూ ఒకప్పుకోరు' అని రాహుల్ గాంధీ చెప్పారు. ధ్వంసమైన విద్యార్థుల భవిష్యత్తు, అవినీతికి ఆయన సంకేతంగా నిలిచారని వ్యాఖ్యానించారు. ఆయనను తొలగించాల్సిందేనని స్పష్టం చేశారు. సోమవారం నాటి విద్యార్థుల ర్యాలీలో పోలీసులు పె÷-లలెట్ గన్స్, లాఠీ చార్జ్‌కు దిగడాన్ని కూడా రాహుల్ గాంధీ ఖండించారు. ఈ చర్యలకు దిగిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భారత దేశ విద్యార్థులకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని మరోసారి డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ ఒక గతమని, భవిష్యత్తు కోసం ఆయన పోరాడజాలరని వ్యాఖ్యానించారు.

# జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు డా. కృష్ణారెడ్డి ఆర్థిక సహాయం



**కరపత్రం ప్రతినిది హైదరాబాద్, జూలై 26**

ఆగస్టు 2, 2026న బెంగళూరులో నిర్వహించనున్న 15వ జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్లో పాల్గొననున్న జివిఆర్ కరాటే అకాడమీ విద్యార్థులు అవిజ్ఞ వెంకట్ రెడ్డి మరియు అన్విత్ పటేల్లకు ప్రముఖ సామాజిక సేవకులు డాక్టర్ కృష్ణారెడ్డి ఆర్థిక సహాయాన్ని (స్పాన్సర్‌షిప్) అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో హిమాయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్న గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చి తెలంగాణకు, అకాడమీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జివిఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారికి ప్రోత్సాహం అందించిన డాక్టర్ కృష్ణారెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి ప్రోత్సాహం క్రీడాకారుల్లో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ బ్లాక్ బెల్ట్‌లు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని, జాతీయ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొననున్న క్రీడాకారులకు అభినందనలు తెలియజేస్తూ విజయవంతంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు.

## హిందూ స్మశానవాటికలో షెడ్డుల ప్రారంభం

**కరపత్రం ప్రతినిది హైదరాబాద్, జూలై 26**

హిందూ స్మశాన వాటికలో ప్రజల సౌకర్యార్థం రూ.1.50 లక్షల వ్యయంతో నూతనంగా



ఏర్పాటు చేసిన రెండు షెడ్డులను ఆదివారం స్మశానవాటిక ట్రస్ట్ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ ప్రారంభించారు. స్మశాన వాటికలో ప్రజలకు మరిన్ని మెరుగైన వసతులు కల్పించే విధంగా తగు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. స్మశాన వాటిక అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం నిధులు కేటాయించినట్లయితే ప్రజలకు మరిన్ని మెరుగైన వసతులు కల్పించే విధంగా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. స్మశాన వాటిక ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత మెడికల్ అండ్ హెల్త్ క్లీనిక్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మహిళల కోసం ఉచిత కుట్టు శిక్షణ, ఎంబ్రాయిడరీ, బ్యూటీషిన్, బోటిక్, మెహింది తదితర కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందికి ఇన్స్యూరెన్స్ కల్పించే విషయంపై ట్రస్ట్ కమిటీలో చర్చించి త్వరలోనే ఓ నిర్ణయం తీసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉద్యోగులందరూ మంచిగా పనిచేసి స్మశాన వాటికకు మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రాజ్కుమార్ విగ్, పి.విజయ్ కుమార్, కె.రమేష్ యాదవ్, బి.కృష్ణాగౌడ్, విద్యాసాగర్, కె.సాయి గిరీధర్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్ పోసి సజీవ దహనం కేసు ఛేదించిన పోలీసులు

- ఏడుగురు నిందితుల అరెస్ట్.. మరో నిందితుడి కోసం గాలింపు
- కొనసాగింపు వేగంగా కేసు ఛేదించిన పోలీసు బృందాన్ని అభినందించిన సీపీ ఎన్. శ్వేత

**కరపత్రం ప్రతినిది వరంగల్, జూలై 25**

వరంగల్ జిల్లాలో సంచలనం సృష్టించిన పెట్రోల్ పోసి వ్యక్తిని సజీవ దహనం చేసిన హత్య కేసును గేసుగొండ పోలీసులు వేగంగా ఛేదించారు. ఘటనకు సంబంధించిన మొత్తం ఎనిమిది మంది నిందితులపై కేసు నమోదు చేయగా, వారిలో ఏడుగురిని అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరుపర్చిన అనంతరం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు పరారీలో ఉండగా, అతని కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి.

పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఎనుమాముల ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన అడపో నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఆమె భర్త అడపో మహేష్ (45)పై ఈ నెల 18వ తేదీ రాత్రి ప్రమీల కాలనీ రోడ్ నెం.2 వద్ద నిందితులు పెట్రోల్ పోసి



నిప్పంటించారు. తీవ్ర గాయాలపాలైన మహేష్ చికిత్స పొందుతూ జూలై 19న మృతి చెందాడు.

పోలీసుల దర్యాప్తులో ప్రధాన నిందితుడు పాటి కుమారస్వామి అలియాస్ కుమార్ (35) గతంలో హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవించి బెయిల్‌పై బయటకు వచ్చినట్లు తేలింది. మహేష్ తనపై తప్పుడు ప్రచారం చేస్తూ రాజకీయంగా ప్రతిష్ట దెబ్బతీస్తున్నాడనే అనుమానంతో పాత కక్షను మనసులో పెట్టుకుని హత్యకు కుట్ర పన్నినట్లు విచారణలో వెల్లడైంది. కుమార్‌తో పాటు గండం నరేష్, జాను మధు, పట్లా శ్రీనివాస్ అలియాస్ బండి శ్రీను, లసాని రామ్‌సాయి, టోనీ సంజయ్, పుత్రం శివకుమార్ కలిసి మహేష్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు పోలీసులు తెలిపారు. మరో నిందితుడు సురేష్ ప్రస్తుతం పరారీలో ఉండగా, అతడిని పట్టుకునేందుకు గాలింపు కొనసాగుతోంది.

ఈ ఘటనపై గేసుగొండ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం. 237/2026గా భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్లు 61, 103(1), 308(4), 249 రీడ్ విత్ 3(5) కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తు అధికారి విశ్వేశ్వర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు సమగ్ర విచారణ చేపట్టి ఏడుగురు నిందితులను అరెస్టు చేశాయి.

సంచలన కేసును తక్కువ సమయంలో ఛేదించిన మామునూర్ ఏసీపీ వెంకట్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, దర్యాప్తు అధికారి విశ్వేశ్వర్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు బాబులాల్, సుబ్బారెడ్డి, దేవేంద్ర, శ్రీధర్‌తో పాటు గేసుగొండ పోలీస్ స్టేషన్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ప్రత్యేకంగా అభినందించారు. కేసు దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి, నిందితులకు కోర్టు ద్వారా కఠిన శిక్ష పడేలా పటిష్టమైన ఆధారాలతో చార్జ్‌షీట్ దాఖలు చేస్తామని పోలీసులు వెల్లడించారు.

# దేశ రక్షణలో సైనికుల త్యాగాలు చిరస్మరణీయం: ఎంపీ ఈటల రాజేందర్

- తెలంగాణ తొలి మెట్టు/బ్యూరో, జూలై 26
- కార్గిల్ అమరవీరులకు ఘన నివాళి
- ప్రతి భారతీయుడు జాతీయ భావంతో దేశ సేవలో భాగస్వామి కావాలి

**కరపత్రం ప్రతినిది హైదరాబాద్, జూలై 26**

దేశ సరిహద్దుల వద్ద ప్రాణాలను సైతం పణంగా పెట్టి మాతృభూమి రక్షణ కోసం విధులు నిర్వర్తిస్తున్న భారత సైనికుల త్యాగాలు, సేవలు ఎన్నటికీ మరువలేనివని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా 1999 కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన అమర జవాన్లకు ఎంపీ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశ సైనికులకు, అమరవీర్ల కుటుంబాలను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. దేశ ప్రజల భద్రత, స్వేచ్ఛ, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు సైనికులు చూపిన అసాధారణ ధైర్యసాహసాలు భారత



చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. దేశ రక్షణను కుటుంబాలు, వ్యక్తిగత జీవితాల కంటే గొప్ప బాధ్యతగా భావించి విధులు నిర్వహిస్తున్న సైనికుల త్యాగం వెలకట్టలేనిదని ఈటల రాజేందర్ కొనియాడారు. 140 కోట్ల మంది భారతీయులు ప్రశాంతంగా జీవించేందుకు మన జవాన్లు నిరంతరం అప్రమత్తంగా సరిహద్దుల్లో సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. సరిహద్దుల్లో దేశాన్ని కాపాడే సైనికులకు యావత్ భారతదేశం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రతి



భారతీయుడు దేశభక్తిని, జాతీయ భావాన్ని హృదయంలో నింపుకుని బాధ్యతాయుతమైన పౌరుడిగా వ్యవహరించాలని పిలుపు నిచ్చారు. దేశ రక్షణ అనేది కేవలం సైనికుల బాధ్యత మాత్రమే కాకుండా, ప్రతి పౌరుడి కర్తవ్యమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కార్గిల్ అమరవీరుల త్యాగస్ఫూర్తి భావితరాలకు స్ఫూర్తిదాయకమని, వారి సేవలను దేశం ఎప్పటికీ మరువదని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు.

# శత్రునాశనం-విజయ ప్రాప్తికి బలాకా, విజయామాతల ఆరాధన

- శాకంభరీ నవరాత్రి మహోత్సవాల్లో భక్తుల రద్దీ.. భద్రకాళీ అమ్మవారి ప్రత్యేక అలంకరణలు

**కరపత్రం ప్రతినిది వరంగల్,జూలై 26,**

వరంగల్ మహానగరంలోని చారిత్రాత్మక శ్రీ భద్రకాళీ దేవస్థానంలో నిర్వహిస్తున్న శాకంభరీ నవరాత్రి మహోత్సవాలు ఆదివారం పన్నెండవ రోజుకు వైభవంగా చేరుకున్నాయి. ఆదివారం కావడంతో తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ఉదయం 5 గంటలకు నిత్యాహ్నిక కార్యక్రమాలు పూర్తిచేసిన అనంతరం తిథిమండల దేవతాయజ్ఞంలో భాగంగా కాళీ క్రమానుసారం అమ్మవారి ఉత్సవమూర్తులకు ఇచ్ఛాశక్తి స్వరూపిణిగా 'బలాకా', షోడశీ క్రమానుసారం జ్ఞానశక్తి స్వరూపిణిగా 'విజయామాత' అలంకరణలు చేసి వేదమంత్రోచ్చారణల మధ్య విశేష పూజలు నిర్వహించారు.





దశమహావిద్యలలో ఆద్యవిద్య అయిన కాళీ సపర్యా క్రమంలో ద్వాదశి తిథికి అధిదేవతగా బలాకా అమ్మవారిని ఆరాధిస్తారని ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు తెలిపారు. భక్తుల శత్రువులపై పిడుగుల వర్షంలా విరుచుకుపడి శత్రు సంహారం చేసే శక్తి బలాకా అమ్మవారికి ఉందని, విజయామాత భక్తులకు విజయాన్ని ప్రసాదిస్తుందని ఆయన వివరించారు. శత్రునాశనం, కార్యసిద్ధి, విజయ ప్రాప్తి కోసం భక్తులు ఈ రెండు స్వరూపాలను విశేష భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారని పేర్కొన్నారు.

ఆదివారం సెలవు దినం కావడంతో ఆలయ ప్రాంగణం భక్తజన సందోహంతో కళకళలాడింది. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించి ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు.

శ్రీ భద్రకాళీ దేవస్థానం కార్యనిర్వహణాధికారి రామల సునీత మహోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.

# సేంద్రియ వ్యవసాయమే రైతుకు అధిక లాభాల బాట

- భూసారాన్ని కాపాడుతూ ఖర్చులు తగ్గించే ఉత్తమ మార్గం : పిడిశెట్టి రాజు

**కరపత్రం ప్రతినిది కోహెడ, జూలై 26**



సేంద్రియ ఎరువుల వినియోగంతో భూసారం పెరగడంతో పాటు పెట్టుబడి ఖర్చులు తగ్గి, నాణ్యమైన దిగుబడులతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, కంటెస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు అన్నారు.

కోహెడ మండలం వింజపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి పశువుల ఎరువు, వెర్మికంపోస్ట్, పచ్చిరొట్ట ఎరువులు వంటి సహజ వనరులను వినియోగించాలని రైతులకు సూచించారు. రసాయన రహిత వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోందని పేర్కొన్నారు.

సేంద్రియ వ్యవసాయం ద్వారా నేల సారం, పర్యావరణం, మానవ ఆరోగ్యం పరిరక్షణతో పాటు పంటల నాణ్యత కూడా మెరుగు పడుతుందని తెలిపారు. జీవామృతం, వేప కషాయం, బ్రహ్మాస్త్రం వంటి సహజ ద్రావణాలు, పంటల మార్పిడి విధానాన్ని అనుసరించడం ద్వారా చీడపీడల నివారణతో పాటు మంచి దిగుబడులు సాధించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో వింజపల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు.


# జూలై 29న హైదరాబాద్‌లో జార్ఖండ్ ఏకతా సమాజ్ 9వ ఆవిర్భావ మహోత్సవం

- సాంస్కృతిక వైభవం--సామాజిక సేవకు వేదికగా ఈడెన్ గార్డెన్స్ ఫంక్షన్ ప్యాలెస్
- సమాజ బంధువులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకుల పిలుపు

**కరపత్రం ప్రతినిది హైదరాబాద్, జూలై 26**

జార్ఖండ్ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతో పాటు సమాజంలో ఐక్యతను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో జార్ఖండ్ ఏకతా సమాజ్ తన 9వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ నెల 29వ తేదీ (బుధవారం) ఘనంగా నిర్వహించనుంది. ఈ కార్యక్రమం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు హైదరాబాద్‌లోని కింగ్‌కోటి, ఈడెన్ గార్డెన్స్ ఫంక్షన్ ప్యాలెస్లో వైభవంగా జరగనుంది.

ఈ వేడుకకు జార్ఖండ్ ఏకతా సమాజ్ సభ్యులతో పాటు వివిధ సామాజిక సంస్థల ప్రతినిధులు, ప్రముఖులు, వివిధ రంగాలకు చెందిన విశిష్ట అతిథులు, సమాజ బంధువులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. సంస్థ ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం, జార్ఖండ్ సమాజానికి చెందిన ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి పరస్పర సోదరభావాన్ని పెంపొందించడం, జార్ఖండ్ రాష్ట్ర సాంస్కృతిక వారసత్వం, సంప్రదాయాలు, సామాజిక విలువలను భావితరాలకు అందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా నిర్వహిస్తున్నారు. ఆవిర్భావ వేడుకల్లో జానపద, సాంస్కృతిక




ప్రదర్శనలు, విశిష్ట సేవలందించిన ప్రముఖుల సన్మాన కార్యక్రమాలు, సమాజ అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై చర్చలు నిర్వహించనున్నారు. అలాగే గత తొమ్మిదేళ్లుగా జార్ఖండ్ ఏకతా సమాజ్ చేపట్టిన సేవా కార్యక్రమాలు, సమాజ హిత కార్యక్రమాలపై ప్రత్యేక నివేదికను కూడా సభ్యులకు వివరించనున్నారు. రిజిస్ట్రేషన్ నంబర్ 307/2018తో నమోదైన జార్ఖండ్ ఏకతా సమాజ్ సంస్థ, సమాజ బంధువులు, శ్రేయోభిలాషులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరింది. ఈ ఆవిర్భావ దినోత్సవం సమాజ ఐక్యతకు, సామాజిక సేవా స్ఫూర్తికి, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

# రేషన్ డీలర్ అసోసియేషన్ నేత మంత్రి రవీంద్ర కుమార్ మృతి పట్ల సంతాపం

**కరపత్రం ప్రతినిది హైదరాబాద్, జూలై 26**

రేషన్ డీలర్ అసోసియేషన్ నగర నాయకులు, ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి మంత్రి రవీంద్ర కుమార్ ( 65) ఆదివారం తిలక్ నగర్ లో గుండెపోటుతో మృతి చెందాడు. ఆయనకు భార్య కుమార్తె ఉంది. రవీంద్ర కుమార్ మృతి పట్ల మోత్కూరు మార్కెట్ కమిటీ చైర్మన్ నూనె ముంతల విమల వెంకటేశ్వర్లు గౌడ్ తో పాటు పలువురు ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంతాపం ప్రకటించి వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. ఆయన అందించిన సేవలను ఈ సందర్భంగా పలువురు గుర్తు చేసుకున్నారు.



# రాజీనామా పరిష్కారం కాదు.. పరీక్షల వ్యవస్థనే ప్రక్షాళన చేయాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

**తెలంగాణ తొలి మెట్టు/హైదరాబాద్, జూలై 26**

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినంత మాత్రాన నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల నిర్వహణలో తలెత్తిన సంక్షోభానికి పరిష్కారం దొరికినట్లు కాదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు, బీసీ జేఏసీ రాష్ట్ర కో ఆర్డినేటర్ గుజ్జ సత్యం అన్నారు. 'రాజీనామా అనేది వైఫల్యానికి రాజకీయ, నైతిక బాధ్యత వహించడమే తపప.. వ్యవస్థలోని లోపాలకు చికిత్స కాదని, మంత్ర మారవచ్చు.. కానీ వ్యవస్థ మారకపోతే మరో పేపర్ లీక్ జరగదనే



భరోసా ఎవరు ఇస్తారని ఆయన ప్రశ్నించారు. ఆదివారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ... వ్యక్తులు కాదు.. వ్యవస్థ మారాలని, ఒక మంత్రి రాజీనామా చేయడం, అధికారులను బదిలీ చేయడం ద్వారా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదని అన్నారు. ప్రశ్నపత్రం తయారీ నుంచి పరీక్ష నిర్వహణ, ఫలితాల ప్రకటన వరకు ప్రతి దశలో పారదర్శకత, భద్రత, జవాబుదారీతనం ఉండేలా సమగ్ర సంస్కరణలు చేపట్టాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులకు కావాల్సింది రాజీనామాలు కాదని, నిష్పక్షపాతంగా పరీక్ష జరుగుతుందనే భరోసా డబ్బు, పలుకుబడి, మాఫీయా కంటే ప్రతిభకే విలువ ఉంటుందనే నమ్మకం కల్పించాలని ఆయన పేర్కొన్నారు.

## రాచపల్లి ఆర్ అండ్ బి ప్రధాన రహదారి దుస్థితి




**గుంతలమయమైన రోడ్డుతో నిత్యం నరకయాతన.. ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలు**

**తక్షణమే మరమ్మతులు చేపట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు గ్రామస్తుల విజ్ఞప్తి**

**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట, జూలై 26:**
కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం రాచపల్లి గ్రామంలోని ఆర్ అండ్ బి ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారింది. రహదారి అధ్వాన్న పరిస్థితికి చేరుకోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజూ ఈ రహదారిపై ప్రయాణించే విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు, వాహనదారులు నిత్యం అవస్థలు పడుతున్నారు. వర్షాలు కురిసిన ప్రతిసారి రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో గుంతలు కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, ఇతర వాహనాలు సైతం ఈ రహదారిపై ప్రయాణించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వారు తెలిపారు. ఈ రహదారి గ్రామానికి ప్రధాన మార్గం అయినప్పటికీ ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్ అండ్ బి శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి రహదారిని పరిశీలించి తక్షణమే మరమ్మతు పనులు ప్రారంభించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. గ్రామ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని శాశ్వత పరిష్కారం చూపాలని, నాణ్యమైన రహదారిని నిర్మించాలని వారు కోరుతున్నారు.

## జమ్మికుంట శ్రీ సంతోషిమాత ఆలయంలో
## ఘనంగా శాకంబరి ఉత్సవం

- సోమవారం ఉదయం 10 గంటలకు లలితా పారాయణం
- భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ పిలుపు
- అమ్మవారి కృపా కటాక్షాలు పొందేందుకు ఈ దివ్య కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూలై 26:**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని శ్రీ సంతోషిమాత ఆలయంలో ఈ నెల జూలై 27, 2026 (సోమవారం) ఉదయం 10:00 గంటలకు అత్యంత భక్తిశ్రద్ధలతో శాకంబరి ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు, అలంకరణలు నిర్వహించడంతో పాటు అనంతరం పవిత్రమైన శ్రీ లలితా సహస్రనామ పారాయణం భక్తుల సమక్షంలో జరగనుంది. శాకంబరి దేవి ప్రకృతి సంపదలకు, అన్నపూర్ణ స్వరూపిణిగా భక్తులు ఆరాధించే దైవం. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొంటే ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖశాంతులు కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా పుష్పాలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించనున్నారు. అలాగే లలితా పారాయణంలో మహిళలు, యువత, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అనుగ్రహాన్ని పొందాలని ఆలయ కమిటీ కోరింది. భక్తులందరూ కుటుంబ సమేతంగా విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

## వైయస్సార్ సిపి విద్యార్థి యూత్ ర్యాలీ ను విజయవంతం చేయండి ర్యాలీ పోస్టర్లను ఆవిష్కరించిన వైఎస్ఆర్సిపి విద్యార్థి విభాగం



**కరపత్రం ప్రతినిధి నరసరావుపేట, జూలై 26 :**
పల్నాడు జిల్లా వైయస్సార్సీపి కార్యాలయం నరసరావుపేట నందు విద్యార్థి విభాగం అధ్యక్షుడు గజ్జెర్లపూడి ఆకాష్ ఆధ్వర్యంలో ర్యాలీ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. 28న యువత ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరుగునున్నట్లు ఆకాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకాష్ తో పాటు, స్టేట్ విద్యార్థి విభాగం జనరల్ సెక్రెటరీ ఉప్పుతోళ్ల వేణు, కందుల శ్రీకాంత్ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు, వెంకట యాదవ్, జిల్లా యువజన విభాగ ఉపాధ్యక్షులు, నరసరావుపేట విద్యార్థి విభాగం అధ్యక్షులు విజయ రెడ్డి, మనింద్రారెడ్డి, నియోజకవర్గ విభజన అధ్యక్షులు, శాంత కుమార్ (బంటి) నరసరావుపేట మండల విద్యార్థి విభాగం అధ్యక్షులు, గెల్లి తేజ రెడ్డి రొంపిచర్ల మండలం విద్యార్థి విభాగం అధ్యక్షులు, షోయబ్ జిల్లా విద్యార్థి విభాగం జనరల్ సెక్రెటరీ, జానీభాష జిల్లా విద్యార్థి విభాగం జనరల్ సెక్రెటరీ, మరియు వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

# విద్యా ప్రతిభకు ఘన సత్కారం.. జమ్మికుంటలో వైభవంగా అవొపా మెరిట్ అవార్డ్స్--2026

**అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులు -- విద్యే విజయానికి బాట అంటూ అవొపా నాయకుల పిలుపు**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూలై 26:**
విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి వారిని మరింత ఉన్నత శిఖరాలకు చేర్చే లక్ష్యంతో ఆర్యవైశ్య అవొపా జమ్మికుంట శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "అవొపా మెరిట్ అవార్డ్స్--2026" కార్యక్రమం ఆదివారం జమ్మికుంట పట్టణంలో అత్యంత వైభవంగా జరిగింది. సంఘ సభ్యులు, ప్రముఖులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ప్రతిభను ప్రోత్సహించే ఈ కార్యక్రమం విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీతో పాటు వివిధ పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్యవైశ్య విద్యార్థులను అవొపా సంఘం ఘనంగా సన్మానించింది. అవార్డు గ్రహీతలకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందజేసి వారి కృషిని అభినందించారు. విద్యార్థుల విజయాలను సభలో ప్రత్యేకంగా పరిచయం చేయగా, హాజరైన వారంతా చప్పట్లతో అభినందనలు తెలియజేశారు. సభలో మాట్లాడిన అవొపా నాయకులు విద్య అనేది జీవితాన్ని మలిచే గొప్ప ఆయుధమని పేర్కొన్నారు. కష్టపడి చదివే విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా సమాజానికి మరింత మంది ప్రతిభావంతులను అందించాలనే లక్ష్యంతో అవొపా మెరిట్ అవార్డ్స్‌ను ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామని తెలిపారు. నేటి విద్యార్థులే రేపటి సమాజ నిర్మాతలని, లక్ష్యసాధన కోసం పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. జమ్మికుంట అవొపా అధ్యక్షులు అకినపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావంతో చదువుకొని ఉన్నత స్థానాలను అధిరోహించాలని, తమ కుటుంబంతో పాటు సమాజానికి గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రతిభను ప్రోత్సహించే కార్యక్రమాలకు అవొపా ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమ విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ



రాష్ట్ర అవొపా అధ్యక్షులు మల్లిపెద్ది శంకర్, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కొమురవెల్లి వెంకటేశం, రాష్ట్ర ఉపాధ్యక్షులు వీరబోయిన రమేష్, సామానారాయణ, పి.వి. రామకృష్ణ, జిల్లా బాధ్యులు ఐత సుధాకర్, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు లెంకళ్లపల్లి శరత్ కుమార్, జమ్మికుంట అవొపా ప్రధాన కార్యదర్శి నగేష్, మంచాల రాంబాబు, జోన్ ట్రెజరర్ బచ్చు రమేష్, సంఘ సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మెరిట్ విద్యార్థులే సమాజానికి భవిష్యత్ దిక్సూచులు

**ఆవోపా మెరిట్ అవార్డ్స్--2026లో విద్యార్థులను సన్మానించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూలై 26:**
జమ్మికుంట పట్టణంలో ఆర్యవైశ్య వృత్తి, ఉద్యోగ, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) ఆధ్వర్యంలో నిర్వహించిన ఆవోపా మెరిట్ అవార్డ్స్--2026 కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను గుర్తించి అవార్డులతో ప్రోత్సహించడం అభినందనీయమైన కార్యక్రమమని అన్నారు. ప్రతిభను గుర్తించడం వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగి మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలనే తపన ఏర్పడుతుందని పేర్కొన్నారు. నేటి విద్యార్థులే రేపటి సమాజ నిర్మాతలని, కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఆవోపా సంఘం కేవలం మెరిట్ విద్యార్థులను సత్కరించడమే కాకుండా, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు కూడా అండగా నిలిచి వారి విద్యాభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇలాంటి ప్రోత్సాహక కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్న ఆవోపా కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా అభినందిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చందా రాజు, తెలంగాణ రాష్ట్ర ఆవోపా అధ్యక్షులు మల్లిపెద్ది శంకర్, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కొమురవెల్లి వెంకటేశం, రాష్ట్ర నాయకులు వీరబోయిన రమేష్, సామ నారాయణ, పి.వి. రామకృష్ణ, బచ్చు రమేష్, లెంకళ్లపల్లి శరత్, సుధాకర్, రమేష్, పద్మ,



జమ్మికుంట ఆవోపా అధ్యక్షులు అకినపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొండ్లే నాగేష్, రాంబాబు, ఆవోపా కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ వార్తను మొదటి పేజీ లీడ్ న్యూస్ శైలిలో ఇంకా మరింత ప్రభావవంతంగా కూడా రూపొందించవచ్చు.

## వాసుదేవ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్**
కరీంనగర్‌లోని వాసుదేవ హాస్పిటల్ ఆధ్వర్యంలో కట్టారాంపూర్, గౌతమీనగర్, అయోధ్యనగర్, బాబానగర్ , వాసుదేవ కాలనీ ప్రాంతాల ప్రజల కోసం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించబడింది. ఈ వైద్య శిబిరంలో సుమారు 100 మంది ప్రజలు ఉచిత వైద్య సేవలను పొందారు. వారిలో 35 మందికి ఈసీజీ పరీక్షలు, అలాగే ప్రతి ఒక్కరికీ రక్తంలో చక్కెర (షుగర్) పరీక్షలు నిర్వహించబడినాయి. పరీక్షల అనంతరం ముగ్గురు రోగుల్లో గుండె సంబంధిత సమస్యలు గుర్తించగా, 19 మందికి కొత్తగా మధుమేహం , 23 మందికి అధిక రక్తపోటు ఉన్నట్లు నిర్ధారించబడింది. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రోత్సాహం ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రతి లబ్ధిదారునికి ఒక జూట్ బ్యాగ్, ఒక కిచెన్ కిట్ , అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేయబడినాయి. ఈ శిబిరంలో వాసుదేవ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, డాక్టర్ బి.ఎస్. రాజు, డాక్టర్ ఉదయ్, డాక్టర్ సాయి మేఘన, డాక్టర్ సాయి ప్రీతమ్, డాక్టర్ ఆర్.పీ. ప్రసాద్ మరియు హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా-137గా ప్రతినిధులు జిల్లా గవర్నర్ కొంజర్ల మహేష్, ఇంజి.




కోలా అన్నారెడ్డి, పులాల శ్యామ్, అల్లాడి ఆనంద్ కుమార్ శర్మ పాల్గొన్నారు. ఈ శిబిరం నిర్వహణలో స్థానిక సామాజిక సేవకుడు, మాజీ బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థి పండుగ నాగరాజు విశేష కృషి చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని డిప్యూటీ మేయర్ సునీల్ రావు ప్రారంభించగా, స్థానిక కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ ప్రజలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాసుదేవ హాస్పిటల్ అధినేత డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ మాట్లాడుతూ, ఇటీవల చిన్న వయస్సులోనే మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్ వంటి జీవనశైలి వ్యాధులు అధికంగా కనిపిస్తున్నాయని తెలిపారు. వీటి నివారణకు సమతుల్య ఆహారం తీసుకోవడం, రోజుకు కనీసం ఎనిమిది గంటలు నిద్రపోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం , మద్యం, ధూమపానం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. శిబిరంలో పాల్గొన్న ప్రతి లబ్ధిదారునికి ఒక నెలపాటు ఉచిత ఓపీ సేవలు అందించనున్నట్లు తెలిపారు. అలాగే భవిష్యత్తులో నిర్వహించే ప్రతి వైద్య శిబిరంలో ఈసీజీ పరీక్షలను కూడా అందుబాటులో ఉంచుతామని వెల్లడించారు. "సర్వేజనాః సుఖినో భవంతు" అనే లక్ష్యంతో వాసుదేవ హాస్పిటల్ భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తుందని తెలిపారు.

## మెదక్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుల స్వగృహంలో 136వ మంకీ బాత్ కార్యక్రమాన్ని నిర్వహించిన బిజెపి జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధామల్లేష్ గౌడ్

**ముఖ్యఅతిథిగా కిసాన్ మోర్చా జిల్లా ఇన్చార్జ్ విష్ణువర్ధన్ రెడ్డి**

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట జులై 26**
ఆదివారం నాడు భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో 136వ మన్ కీ బాత్ కార్యక్రమని జిల్లా అధ్యక్షుల వారి సొంత స్వగృహంలో వీక్షించడం జరిగిందని మెదక్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఉన్నంతవరకు దేశంలోని ఉన్న రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండడమే కాకుండా వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా భారతీయ జనతా పార్టీ తరఫునుండి దేశం ప్రధాని నరేంద్ర మోడీ సుపరిపాలన సాగిస్తూ నిరుపేద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా కేంద్ర ప్రభుత్వం పరిపాలన సాగిస్తుందని నేడు దేశం లోని రైతులు సుఖశాంతులతో ఉన్నారు అంటే కేవలం కేంద్ర ప్రభుత్వ పరిపాలన చేస్తున్న దేశ ప్రధాని నరేంద్ర మోడీ అని అందరికీ తెలుసు దేశంలోని ఉన్నటువంటి రాష్ట్రాలలో రైతే ముఖ్యం అనే రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని అలాంటి తెలంగాణ రాష్ట్రానికి కూడా ప్రత్యేక నిధులు కేటాయించే ప్రయత్నంలోనే భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఉన్నారని తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన ఉండడంతో తెలంగాణ రాష్ట్రం ఎలాంటి అభివృద్ధి చేయడం లేదని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్యమంత్రి వర్యులు తాను ఇష్టానుసారంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలపై రాజకీయం చేయడమే తప్ప అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చినటువంటి వాగ్దానాలను అమలు చేయకుండా కాలయాపన చేయడమే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రజలకు చేసింది ఏమీ లేదని ఆయన ఎద్దేవ చేశారుఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కిసాన్ మోర్చా జిల్లా ఇంచార్జ్ విష్ణు వర్ధన్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సంగసని సురేష్ జిల్లా సీనియర్ నాయకులు పెద్ద రమేష్ గౌడ్ మాజీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చిన్న రమేష్ గౌడ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు గౌడ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు గుండం శంకర్ కౌన్సిల్ పోటీదారులు శ్రీనివాస్ పట్టణ ప్రధాన కార్యదర్శి సంగసని రాజు బిజెవైఎం నాయకులు చందు తదితరులు పాల్గొన్నారు.



